క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం అయినట్లు రీజినల్ కోఆర్డినేటర్ సత్యానారాయణగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉందన్నారు. ఈనెల 18వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 7382929609 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

యూనిఫామ్స్ త్వరగా అందజేయండి

దేవరకద్ర: విద్యార్థులకు ఆగస్టు 15 లోగా యూనిఫామ్స్ అందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం దేవరకద్ర మహిళా సమాఖ్య భవనంలో యూనిఫామ్స్ తయారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్తులు కుడుతున్న వారితో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి

జడ్చర్ల టౌన్: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష కోసం ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు దోహద పడాలని జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. గురువారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా వారికి ఇచ్చిన శిక్షణ ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సెప్టెంబర్‌లో నిర్వహించే సామర్థ్య పరీక్ష గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్రస్థాయికంటే ఎక్కువ ప్రమాణాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నోడల్ అధికారి జగదీశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రకళ, లక్ష్మి, అనంతప్ప, మారేపల్లి శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ జగదీశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, లోక్యానాయక్ పాల్గొన్నారు.

గొడవలో మహిళకు గాయాలు

అడ్డాకుల: పొన్నకల్‌లో రెండు కుటుంబాలు గొడవ పడిన ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన భార్గవి, రామకృష్ణారెడ్డి దంపతులు. వీరి ఇంటిపై పడే వర్షం నీళ్లు సీసీరోడ్డుపై పడుతున్నాయన్న కారణంతో సమీపంలోనే నివాసముండే లక్ష్మి, ఆంజనేయులు దంపతులు గురువారం గొడవ పడ్డారు. ఈక్రమంలో భార్గవి చెవి కమ్మ తెగిపోయింది. దీంతో చెవి వద్ద తీవ్ర రక్తస్రావమైంది. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

భూమి అక్రమంగా పట్టా చేసుకున్నారని ఫిర్యాదు



గండేడ్: తనకు రావాల్సిన భూమి విషయంలో న్యాయం చేయాలని ఓ బాధితుడు ప్రజాసంఘాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం నిరసన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డిపల్లికి చెందిన దొడ్డె కృష్ణయ్య తల్లి దొడ్డె రాములమ్మ 2014లో మరణించారు. ఆమె భర్త పెంటయ్య కూడా చనిపోయాడు. కాగా వారికి కుమారుడు కృష్ణయ్య ఒక్కడే ఉన్నాడు. కాగా రాములమ్మ పేరున పెద్దవార్వాల్ శివారులో 4 ఎకరాల 11 గుంటల భూమి ఉంది. దీంతో కృష్ణయ్య అర్జీ పెట్టుకోగా 2018లో విరాసత్ చేస్తూ అప్పటి తహసీల్దార్ ప్రొసీడింగ్ ఇచ్చారు. కాగా అప్పట్లో రెవెన్యూ వాళ్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. కానీ ఏడాదికే 2019లో భూమి కాస్తా తన తాత దొడ్డె పోషప్ప పేరు మీదకు పోయింది. ఆన్‌లైన్‌లో ఆయన పేరే వస్తోంది. తన భూమి తనకు చేయాలని కృష్ణయ్య పలు మార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో గురువారం నిరసన చేపట్టాడు. అప్పటి తహసీల్దార్, ఆర్‌ఐలు ఇద్దరు కలిసి పోషప్పతో కుమ్మక్కై భూమి తనకు దక్కకుండా చేశారని ఆరోపించాడు. వారిపై చర్యలు తీసుకోవాలని.. విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. అనంతరం తహసీల్దార్ నాగలక్ష్మికి అన్ని ఆధారాలు సమర్పించగా.. కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

పంట రుణాలివ్వాలి



అడ్డాకుల: రుణమాఫీ పొందిన రైతులకు బ్యాంకర్లు కొత్త పంట రుణాలివ్వాలని జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని ఏపీజీవీబీలో గురువారం ఆయన రైతులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడారు. ఆగస్టు 15 నాటికి చివరి దశ మాఫీ కూడా పూర్తవుతుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ అనంతజ్యోతి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్‌గౌడ్, ఏఈఓ శివ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక తీర్పు



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును వెంటనే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కరుణాకర్‌గౌడ్, డాక్టర్ రాంమోహన్ పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: దళిత సమాజంలో అంతర్గత సమానత్వం కోసం వర్గీకరణ అవసరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మొదటినుంచి దళితుల్లో సమానత్వం, ఏబీసీడీ వర్గీకరణ కోసం కట్టుబడి ఉన్నారని అన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో పలు సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ చేసిన అలుపెరుగని పోరాటం వల్ల వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎంఎస్‌ఎఫ్ నాయకుడు కార్తిక్, అధ్యాపకులు మాళవి, పుష్పలత, అర్జున్‌కుమార్, శైలేష్, జ్ఞానేశ్వర్, రామ్మోహన్, జేఏసీ నాయకులు రాము, కమలాకర్, గణేష్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలకేంద్రంలో మందకృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కృష్ణయ్య, బాలయ్య, సురేష్, బాలు, సుదర్శన్, విజయ్‌కుమార్, భీంరాజ్, రవీంద్ర పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక తీర్పు అని నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. మొగులయ్య, పానుగంటి నాగేశం, రమేష్, చెన్నప్ప, రాములు, జోగు కురుమయ్య, ఆంజనేయులు, సాయిలు, నర్సిములు, చందు, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

భూత్పూర్: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు హెచ్.శరబంద్, టౌన్ అధ్యక్షుడు రాము ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నవాబుపేట: మండలకేంద్రంలో ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శాంతయ్య, నాయకులు శంకర్, ఆశన్న, శ్రీను, కోస్గిరాజు, సత్యం, వెంకటయ్య, రాములు, శేఖర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



జడ్చర్లలో నాయకుల సంబురాలు



మిడ్జిల్‌లో..

సర్వీస్ రోడ్డుకు మరమ్మతు

గండేడ్: ప్రమాదకర సర్వీస్ రోడ్డు శీర్షికన.. అటెన్షన్ ప్లీజ్ అంటూ గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ చించోళి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే పలుచోట్ల ఇవి అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జానంపల్లి వద్ద సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు ఓవైపు వర్షానికి కోసుకుపోవడంతో పాటు అసంపూర్తిగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే కథనం ప్రచురితం కాగా.. అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. రోడ్డు మరమ్మతు చేపట్టారు. కాగా సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షి దినపత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డును చదును చేస్తున్న రోలర్

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.సుకన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఆమెకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. సదాశివయ్య బొటానికల్ గార్డెన్‌లో తయారు చేసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె బొటానికల్ గార్డెన్‌లో మొక్కనాటి నీరు పోశారు.

నూతన కమిటీ ఎన్నిక

దేవరకద్ర రూరల్: వెంకటాయపల్లిలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నారాయణ, చైర్మన్‌గా బంగారి నరసింహ, వైస్ చైర్మన్‌గా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శివ, కార్యదర్శిగా సత్యన్న, కార్య నిర్వాహక కార్యదర్శిగా సుదర్శన్, చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా మణిప్రసాద్, భవానీ శంకర్, ఆంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం ఆలయానికి బంగారి పెద్ద కాశన్న, నమ్మిగారి నరసింహులు రూ. 5 వేలు విరాళం అందజేశారు.

కుట్టుమిషన్ల అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో తమవంతు భాగస్వామ్యం అవుతామని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు ఎండి.ఇమ్రాన్ అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్, నాయకులు మొయిజ్, సల్మాన్, అతహరుద్దీన్, ఫేరోజ్, అస్రార్, సమీర్, జమీర్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌కు ఘననివాళి

జడ్చర్ల టౌన్: బాలగంగాధర్ తిలక్ వర్ధంతిని పట్టణంలో గురువారం నిర్వహించారు. అనురాగిణి ఆశ్రమంలో నివాళి అర్పించారు. విశ్వహిందూ పరిషత్, సంస్కార భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సంస్కారభారతి సభ్యుడు రాధాకృష్ణ, లావణ్య, రామనాథం పాల్గొన్నారు.

హరికిషన్ సుర్జిత్, కృష్ణమూర్తిలకు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి పోరాడిన మహనేతలు హరికిషన్ సుర్జిత్, కృష్ణమూర్తిని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు కొనియాడారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారి వర్ధంతి నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, రాజ్‌కుమార్, వెంకటేష్, సురేష్, ప్రశాంత్, దిలీప్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు..

హన్వాడ: పెద్దర్పల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నరేష్‌గౌడ్(33) బుధవారం అర్ధరాత్రి తాండూర్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. చిన్నదర్పల్లి గోదాముల సమీపంలో ఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాగా నరేష్‌గౌడ్ ఘటనాస్థలిలలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు ఉన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారందామె హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, షెడ్యూల్‌ను సీఎస్ వివరించారు. 5న గ్రామాలు, పట్టణ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించాలని, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురుగు కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు, 9న డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఇందుకోసం గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయిలో ప్రత్యేక బృందాలను కలెక్టర్ నియమించాలని చెప్పారు. కార్యక్రమాలను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించి నివేదిక కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, ఉద్యాన శాఖాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దగుట్టపై సంప్రోక్షణ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై శుక్రవారం రంగనాయకస్వామి ఆలయ సంప్రోక్షణ, కుంభాభిషేకం చేయనున్నట్లు.. రంగనాయక పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి తెలిపారు. గుట్టపై ఇటీవల జరిగిన దుర్ఘటన అపరాధం ప్రాయశ్చిత్తం కోసం మహాసంప్రోక్షణ ఉంటుందన్నారు. 7గంటలకు విశ్వక్సేన ఆరాధన, శ్రీవాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, నవకలశస్నపనం, అలంకరణ ఊరేగింపు, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర శ్రీసుదర్శన శతక పారాయణ హవన క్రతువు చేపట్టనున్నట్లు తెలిపారు.

మైక్‌సెట్ వితరణ

పెద్దగుట్ట ఆలయానికి మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ మేరకు గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పి.మురళి, శ్రీకాంత్, నరసింహ తదితరులు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి, సభ్యులకు అందజేశారు.

ఆటో డ్రైవర్ల దినోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబుమియా పాల్గొన్నారు.

రైతులకు అండగా బీకేఎస్

నవాబుపేట: రైతులకు బీకేఎస్ అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు జెట్టి రాములు, కార్యదర్శి రఘునందన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో సమావేశంలో రైతు సమస్యలపై మాట్లాడారు. నవాబుపేట బీకేఎస్ కమిటీని నియమించారు. అధ్యక్షుడుగా బిక్కుమల్ల శ్రీరాములు, ప్రధానకార్యదర్శిగా వెంకటేశ్వరప్ప, ఉపాధ్యక్షులుగా వెంకటాచలం, కోశాధికారిగా వేణునాథంలను నియమించారు.

పశువుల సంతపై వివాదం

మిడ్జిల్: మండల కేంద్రంలో 12 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పశువుల సంత ప్రతి గురువారం వెల్జాల్ రోడ్డు సమీపంలోని వెంచర్‌లో నిర్వహిస్తున్నారు. తైబజారు కాంట్రాక్టర్, . అధికారులకు, గ్రామస్తులకు సమాచారం లేకుండా వెంచర్‌లోకి మార్చడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి సాయన్న, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు వెళ్లి సంత నిర్వహణపై ప్రశ్నించారు. కాగా మళ్లీ వచ్చే గురువారం నుంచి ఇదివరకు ఉన్న చోటే కొనసాగిస్తామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ హర్షణీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం హర్షనీయమని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్లాట్లను రెగ్యులరైజ్‌చేసి బ్యాంక్ రుణాల విషయం, పొజిషన్, లీగల్ క్లియరెన్స్ వచ్చే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. పట్టణ కేంద్రాల్లో, మేజర్ గ్రామ పంచాయతీలు, పల్లెల్లో ప్రస్తుతం ఉన్న మార్కెట్‌రేట్‌ను పునసమీక్షించి ధరలు నిర్ణయించాలని అన్నారు. నాయకులు చందుయాదవ్, రవికిరణ్, ప్రవీణ్‌కుమార్, రఘుయాదవ్, పరశురాం, రమేష్‌యాదవ్, భాస్కర్, దినేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

పరీక్ష తేదీలు పొడిగించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పీజీ పరీక్షల తేదీలు పొడిగించాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్‌ను విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు 9 నుంచి 21 వరకు పరీక్షలు ఉన్నాయని.. అయితే ఈనెల 5వ వరకు డీఎస్సీ, నెట్ ఉన్న నేపథ్యంలో రీషెడ్యూల్ చేయాలని విన్నవించారు. రూప్‌సింగ్, జగదీష్, గోపాల్, నవీన్, అనీల్, ప్రవీణ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత 9 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు అత్యంత పారదర్శకంగా చేపట్టారని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయుల జీవితాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెలుగులు నింపారని వివరించారు. ఉపాధ్యాయుల కృతజ్ఞత సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటున్న సీఎం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు, 4 డీఏలు, పీఆర్‌సీ సైతం ప్రకటించి ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కో చైర్మన్‌గా గోవింద్‌నాయక్

జడ్చర్ల టౌన్: టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో చైర్మన్‌గా జడ్చర్లకు చెందిన తెలంగాణ ప్రాంత గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు యం.మణిపాల్‌రెడ్డి నియామక పత్రంను విడుదల చేశారు. కాగా రెండేళ్ల పాటు కమిటీలో ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు.

పరామర్శ

దేవరకద్ర: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తలను పరామర్శించారు. ఎస్వీఎస్‌లో గోపి రఘు కుమారుడు విక్రమ్‌ను, శ్రీకృష్ణ న్యూరోలో భాస్కర్‌రెడ్డిని పరామర్శించారు. అదేవిధంగా దేవరకద్రకు చెందిన నరేందర్‌గౌడ్, కటికె శ్రీను, నెల్లికొండికి చెందిన కృష్ణరెడ్డి, తాటికొండకు చెందిన ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు.

క్షీరాభిషేకం

అడ్డాకుల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండల అధ్యక్షుడు హనుమంతు, రామన్న, మోహన్, రమేష్, సురేష్, శాంతయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకి చెందిన యువతి(19) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువతి బుధవారం ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

జడ్చర్ల టౌన్: మండలంలో గురువారం అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పర్యటించారు. గంగాపురం జెడ్పీహైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని, పారిశుద్ధ్యం తదితరాలపై స్థానికులు ఫిర్యాదు చేయగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యాధికారి లేకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వన మహోత్సవం నిర్వహణ పరిశీలించారు. గొల్లత్తగుడిని సందర్శించి చరిత్రను తెలుసుకున్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ సరోజ, ఏపీఓ విజయభాస్కర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.



గంగాపురం పీహెచ్‌సీలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

ప్రమాద సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి



ప్రమాదం జరిగిన చోటును పరిశీలిస్తున్న అధికారులు

గండేడ్: వసతి గృహాల్లో ప్రమాదాలు జరిగినపుడు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌డబ్ల్యూఓ సుదర్శన్ సూచించారు. గురువారం వెన్నాచేడ్ ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. బుధవారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్‌పై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన చోటును పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు లక్ష్మణ్, గణేష్‌లు సకాలంలో స్పందించి సిలిండర్‌ను వంటగది నుంచి తీసి పిల్లలను బయటికి పంపించడాన్ని ఆయన ప్రశంసించారు. కాలిపోయిన స్టార్టర్ స్థానంలో కొత్తది బిగించాలని వార్డెన్ మోహన్‌రెడ్డికి సూచించగా.. వెంటనే కొత్తది తెప్పించి బిగించారు. మిగతా గదుల వైరింగ్‌ను పరిశీలించారు. ఎక్కడ కరెంటు సమస్య ఉన్నా వెంటనే సరి చేయించాలని పేర్కొన్నారు. హాస్టల్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలపై వార్డెన్ ఆయనకు వివరించారు. కాగా ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు వివరిస్తానని ఏఎస్‌డబ్ల్యూఓ పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మహబూబ్‌నగర్ రూరల్: సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. డివిజన్ కార్యదర్శి వెంకటేష్, నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుందర్‌రాజ్‌కు అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి గణేష్, నాయకులు బాలు, ఆంజనేయులు, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ డివిజన్ నాయకులు ఎదురింటి నర్సిములు అన్నారు. మాస్ లైన్ ఆధ్వర్యంలో గురువారం కొత్తరేషన్ కార్డులు, కొత్తపెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. వెంటనే హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. అనంతరం తహసీల్దార్ మురళికి వినతి సమర్పించారు. మాస్ లైన్ నాయకులు ఇస్మాయిల్, ప్రభాకర్, శ్రీను నాయక్, వెంకటయ్య, అజ్జుపాష, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో కౌకుంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తక్షణం ప్రతి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. మండల కార్యదర్శి సాంబశివుడు, నాయకులు శివారెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ సుందర్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహిళలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి



జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ మహిళ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ అవమానించారని.. ఆయన వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని మున్సిపల్ మాజీచైర్మన్ నర్సిములు డిమాండ్ చేశారు. కేటీఆర్ పిలుపుమేరకు గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో నాయకులు నిరసన చేపట్టారు. ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణంలో నాయకులు రాస్తారోకో నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, పుర వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలో అధ్యక్షుడు బిక్షపతి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రఘు, కిష్టయ్య, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలో నిర్వహించిన రాస్తారోకోలో నాయకులు బాల్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, బంగారు ప్రతాప్‌రెడ్డి, గోపాల్, భద్రయ్య, శేఖర్, తిరుపతి, భీంరాజ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, చల్మారెడ్డి, నరేష్, యుగంధర్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హలో మాల.. ఛలో ఢిల్లీ మహాధర్నా కరపత్రాలను గురువారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య ఆవిష్కరించారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలు కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణను పదేపదే ముందుకు తీసుకొచ్చి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడం సిగ్గుచేటని అన్నారు. వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలంటూ ఈనెల 9న ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

నవాబుపేట: తల్లిపాలు అమృతం లాంటివని.. వాటితో చంటి బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పారిజాత అన్నారు. గురువారం కారుకొండ, కూచూర్ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మి, సరస్వతీ, స్వాతీ, చంద్రకళ తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మండలపరిధిలో కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జరీనా, వైద్యాధికారి యమున, సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్‌లు సుధాకర్, భాగ్యశ్రీ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలో వైద్యాధికారి రహమత్, సీడీపీఓ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: మండల పరిధిలో సూపర్ వైజర్ అరుణ జ్యోతి, అంగన్‌వాడీలు జయమ్మ, సునీత, మేఘమాల, సరస్వతీ, భాగ్యమ్మ, నాగమణి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: నవజాత శిశువులకు తల్లి ఇచ్చే ముర్రు పాలు తొలి టీకా కంటే ఎంతో ఉపయోగకరంగా పని చేస్తాయని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గైనిక్-పిడియాట్రిక్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో..ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలింతలకు కిట్లు అందజేశారు. హెచ్‌ఓడీ సంగీత షా, చిన్న పిల్లల విభాగం హెచ్‌ఓడీ సురేష్, డీఐఓ పద్మజా, ఈఎన్‌టీ వైద్యుడు శ్రీకాంత్, గైనిక్ వైద్యురాలు లక్ష్మీపద్మప్రియ, స్ఫూర్తిరెడ్డి, అర్చన తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో బాలింతలకు కిట్లు అందిస్తున్న వైద్యులు